షణ్ముఖ SHANMUKHAVELUGU APTEL 16448

# వెలుగు

ప్రతి వార్త వెలుగు వైపు    తెలుగు దినపత్రిక




సంపుటి : 1 సంచిక : 230 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులసెట్టి రాధాకృష్ణ దాస్ ఆదివారం 21 జూలై 2024 పేజీలు 8 : వెల 3/- ఒంగోలు

VOLUME : 01 ISSUE : 230 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE Sunday 21 july 2024 PAGES : 8 PRICE : 3/-

# డ్రగ్స్ గంజాయి అరికట్టడంలో యువత భాగస్వాములు కావాలి

**గంజాయి రహిత జిల్లాగా మార్చడమే మా లక్ష్యం.**

**జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్**



**షణ్ముఖ వెలుగు మెట్ పల్లి ప్రతినిధి జూలై 20** జగిత్యాల జిల్లా వ్యాప్తంగా మాదకద్రవ్యాల వినియోగం వలన కలిగే పరిణామాల పై అవగాహన చేయడంతో పాటు వినియోగిం చడం వల్ల కలిగే నష్టాలపై యువతకు పాఠశాల కళాశాల విద్యార్థులకు దిశా నిర్దేశం చేసే మిషన్ పరివర్తన కార్యక్ర మం లో భాగంగా మెట్ పల్లి లోని నరేంద్ర డిగ్రీ కళాశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ సమాజం నుంచి యువత మంచిని మాత్రమే నేర్చుకోవాలని చెడు వ్యసనాలు అలవాట్లకు ఆకర్షితులై జీవితాలు నాశనం చేసుకోకూడదని సూచించారు. యువత పైనే దేశ భవిష్యత్తు ఆధారపడి ఉందని అన్నారు. మత్తు పదార్థాలకు బానిస కాకుండా మంచిగా చదువుకొని ఉన్నత లక్ష్యాలను సాధించాలన్నారు. మత్తు పదార్థాలకు మానసికంగా బానిస కావడం ద్వారా అనుకోకుండా క్రైమ్ చేసే అవకాశం ఉందని అన్నారు. అనుకోకుండా ఏదైనా క్రైం చేసినట్లయితే ఎలాంటి ఉద్యోగం కూడా రాదని నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకో ట్రాఫిక్ సబ్ స్టాన్స్ యాక్ట్ 1985 ప్రకారం శిక్షార్హులు అవుతారని అన్నారు. చట్టాలు బలంగా ఉన్నాయని తర్వాత బాధపడి లాభం లేదని అన్నారు. డ్రగ్స్ సరఫరా వినియోగాన్ని సమూలంగా నిర్మూలించడానికి ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేయడంతో పాటు సమాచార వ్యవస్థను మరింత బలోపేతం చేస్తున్నట్లు తెలిపారు. డ్రగ్స్ మత్తు పదార్థాలు గంజాయి గురించిన సమాచారం తెలిస్తే స్థానిక పోలీసులకు గాని డయల్ -100కు ఫోన్ చేసి సమాచారం అందించాలని అన్నారు. ముఖ్యంగా విద్యార్థులు మత్తు పదార్థాల జోలికి వెళ్లకుండా విద్యాసంస్థల్లో యాంటీ డ్రగ్స్ కమిటీల ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పల్లెల్లో ర్యాలీలు సదస్సులు నిర్వహించి డ్రగ్స్ అనర్థాలపై ప్రజల్లో అవగాహన కల్పించడమే కాకుండా సరిహద్దుల్లో కట్టుదిట్టమైన నిఘా తో అడ్డుకట్ట వేసేందుకు చర్యలు చేపట్టామని అన్నారు. ఈ సందర్భంగా మత్తు పదార్థాలు సేవించడం వల్ల కలిగే దుష్పరిణామాలు గురించి విద్యార్థులకు వీడియోల ద్వారా అవగాహన కల్పించారు. డ్రగ్స్ నివారణలో యువత యొక్క పాత్ర పై ఎస్పీ అడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పిన విద్యార్థిని విద్యార్థులకు ఎస్పీ బహుమతులు ప్రధానం చేశారు. ఈ అవగాహన కార్యక్రమంలో డిఎస్పీ ఉమ మహేశ్వర రావు సి. ఐ నిరంజన్ రెడ్డి ఎస్సై లు చిరంజీవి అనిల్ కిరణ్ కుమార్ నవీన్ శ్యామ్ రాజ్ కళాశాల ప్రిన్సిపాల్ ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## 82 లక్షలు తీసుకొని మోసం చేసి చంపుతామని బెదిరిస్తున్న జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపల్లి రాజేశ్వరరావు ఎర్రం రాజు సురేందర్ రాజు లపై కేసు నమోదు...!

-82 లక్షలు తీసుకొని మోసం చేసాడని బాసని పాపిరెడ్డి ఫిర్యాదు





**షణ్ముఖ వెలుగు జమ్మికుంట ప్రతినిధి జూలై 20** కరీంనగర్ జిల్లా ఆబాది జమ్మికుంట నివాసి ఫిర్యాది దారు అయిన బాసని పాపిరెడ్డి తండ్రి పేరు శివారెడ్డి గ్రామం ఆబాది జమ్మికుంట నివాసి కొద్ది రోజుల క్రితం జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపల్లి రాజేశ్వరరావు మరియు ఎర్రంరాజు సురేందర్ రాజు లు తనకు కెనాల్ కాంట్రాక్ట్ వర్క్ లో పార్టనర్ గా చేర్చుకుంటామని చెప్పి 82.00 ఎనభై రెండు లక్షల రూపాయలు తీసుకొని ఎలాంటి పని అప్పగించకుండా తిప్పుకుంటుండగా డబ్బులు తిరిగి ఇవ్వమని అడిగినందుకు చంపుతామని బెదిరించారని డబ్బులు తీసుకొని మోసం చేశారని కోర్టు ద్వారా ఫిర్యాదు ఇవ్వగా శనివారం రోజున కేసు నమోదు చేసినట్లు జమ్మికుంట పట్టణ సీఐ వరగంటి రవి తెలిపారు

# అసెంబ్లీ సమావేశాల్లో జాబ్ క్యాలెండర్

**ప్రతి మార్చిలోగా ఉన్న ఖాళీల వివరాలు తెప్పించుకుంటాం**

**జూన్ 2లోగా నోటిఫికేషన్.. డిసెంబర్ 9లోగా నియామకాలు**

**రాజీవ్‌గాంధీ సివిల్స్ అభయహస్తం ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్‌రెడ్డి**



హైదరాబాద్

ఈ నెల 23 నుంచి ప్రారంభమయ్యే అసెంబ్లీ సమావేశాల్లోనే జాబ్ క్యాలెండర్‌ను ప్రవేశపెడుతామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పారు. ఇక నుంచి ప్రతిఏటా మార్చిలోగా అన్ని శాఖల్లో ఉన్న ఖాళీల వివరాలు తెప్పించుకుంటామని తెలిపారు. జూన్ 2వ తేదీలోగా ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసి, డిసెంబర్ 9వ తేదీలోగా నియామకాల ప్రక్రియ పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామని స్పష్టంచేశారు. హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో శనివారం సింగరేణి సంస్థ సామాజిక బాధ్యత (సీఎస్సార్)లో భాగంగా సివిల్స్ ప్రిలిమినరీ పరీక్ష పాసైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థుల్లో అర్హులకు లక్ష చొప్పున ఆర్థికసహాయం అందించే 'రాజీవ్‌గాంధీ సివిల్స్ అభయహస్తం పథకం' ప్రారంభోత్సవంలో రేవంత్‌రెడ్డి మాట్లాడారు. ఉద్యోగాల కోసమే తెలంగాణ పోరాటం జరిగిందని, నిరుద్యోగుల సమస్యలు పరిషరించడమే ప్రభుత్వ ప్రాధాన్యమని ఆయన చెప్పారు. సివిల్స్ ప్రిలిమినరీ పరీక్షలో విజయం సాధించినవారికి మెయిన్స్ కోచింగ్ స్టడీ మెటీరియల్, హాస్టల్ ఖర్చుల కోసం రూ.లక్ష ఆర్థికసాయాన్ని అందిస్తున్నట్టు తెలిపారు. ప్రతిఏటా రాష్ట్రం నుంచి సివిల్స్‌కు 50 వేల మంది దరఖాస్తు చేసుకుంటున్నారని, వీరిలో సుమారు 250-300 మంది మెయిన్స్‌కు అర్హత సాధిస్తున్నారని - మిగతా3లో



## 15 జిల్లాలకు హై అలర్ట్

**మరో మూడు రోజులు భారీ నుంచి అతి భారీ వర్షాలు**

**ముంచెత్తుతున్న ముసురు వాన.. రాష్ట్రంలో పొంగుతున్న వాగులు**

**ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి.. అప్రమత్తమైన యంత్రాంగం**

**లోతట్టు ప్రాంతాలు అప్రమత్తం.. పెద్దవాగు పరిస్థితిపై సీఎం ఆరా**

**జలపాతాలు, చెరువుల వద్దకు వెళ్లొద్దు: పోలీసులు**

**కలెక్టర్లను అప్రమత్తం చేసిన మంత్రి సీతక**

హైదరాబాద్

రాష్ట్రంలో మరో మూడు రోజులపాటు వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. హైదరాబాద్, వికారాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, రంగారెడ్డి, సంగారెడ్డి, భద్రాద్రి కొత్తగూడెం, హన్మకొండ, జగిత్యాల, జయశంకర్ భూపాలపల్లి, ఖమ్మం, కొమరం భీమ్ ఆసిఫాబాద్, మహబూబాబాద్, మంచిర్యాల, ములుగు, వరంగల్ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్‌ను జారీ చేసింది. మరోవైపు భారీ వర్ష సూచన నేపథ్యంలో అధికారులు అప్రమత్తమయ్యారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. భద్రాద్రి జిల్లాలోని పెదవాగు పొంగిపొర్లుతుండటంపై సీఎం రేవంత్‌రెడ్డి ఆరా తీశారు.

# రాజకీయాలకు ఎన్టీఆర్ బ్రాండ్




**కులానికి, ప్రాంతానికి అతీతంగా తెలుగువారి అభివృద్ధికి పాటుపడే నాయకత్వం కావాలని**

**హైదరాబాద్ అభివృద్ధిలో కమ్మ సామాజికవర్గం భాగస్వాములు కావాలని ఆహ్వానం**

**తెలంగాణలో వివక్ష ఉండదు**

**మా కులాలను అభిమానిస్తాం.. ఇతర కులాలను గౌరవిస్తాం**

**రాజకీయాలకు ఎన్టీఆర్ ఒక బ్రాండ్**

**ఎంతో మందికి ఆయన అవకాశాలు ఇచ్చారు**

హైదరాబాద్

కులానికి, ప్రాంతానికి అతీతంగా తెలుగువారి అభివృద్ధికి పాటుపడే నాయకత్వం కావాలని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. హైదరాబాద్ హెచ్ఐసీసీలో శనివారం జరిగిన కమ్మ గ్లోబల్ సమ్మిట్ లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. హైదరాబాద్ అభివృద్ధిలో కమ్మ సామాజికవర్గం భాగస్వాములు కావాలని ఆహ్వానించారు. తెలంగాణలో వివక్ష ఉండదని.. మా కులాలను అభిమానిస్తాం, ఇతర కులాలను గౌరవిస్తామని చెప్పారు. సమాజానికి సేవ సహజ గుణాన్ని మరవొద్దని కమ్మ సామాజిక వర్గాన్ని ఆయన కోరారు. రాజకీయాలకు ఎన్టీఆర్ ఒక బ్రాండ్ అని, ఎంతో మందికి ఆయన అవకాశాలు ఇచ్చారని సీఎం రేవంత్ అన్నారు. ఇప్పుడు సంకీర్ణ ప్రభుత్వాలకు ఆయనే ఆద్యుడని గుర్తు చేశారు."కమ్మ అంటేనే కష్టపడే గుణం ఉన్నవారు.. అమ్మలాంటి ఆప్యాయత కలిగినవారు. కమ్మవారు నేలను నమ్ముకుని కష్టపడి పనిచేస్తారు. ఎక్కడ సారవంతమైన నేల ఉంటే అక్కడ కమ్మవారు కనిపిస్తారు. కష్టపడటం.. పదిమందికి సాయం చేయడం కమ్మవారి - మిగతా3లో

# తక్కువ ధరకే బంగారం అంటూ ఫేక్ నాణేలు అమ్ముతున్న ముఠా అరెస్ట్

**షాపూర్ నగర్ హొటల్లో ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్న బాలానగర్ ఎస్వోటీ పోలీసులు.**

**నిందితుల వద్ద ఉన్న ఫేక్ నాణేలు 28.50లక్షల నగదు స్వాధీనం**







**షణ్ముఖ వెలుగు కుత్బుల్లాపూర్ ప్రతినిధి జూలై 20** తక్కువ ధరకే బంగారం ఇస్తామంటూ నకిలీ బంగారాన్ని ప్రజలకు విక్రయిస్తున్న ముగ్గురు సభ్యుల ముఠాను బాలానగర్ ఎస్ఓటీ పోలీసులు మరియు జీడిమెట్ల పోలీసులు సంయుక్తంగా కలిసి అరెస్టు చేశారు. వారి వద్ద నుండి (ఒక్కో నాణెం 20 గ్రాములు) గల 100 నకిలీ బంగారు నాణేలు 28.50 లక్షల నగదు స్వాదీనం చేసుకున్నారు. షాపూర్ నగర్ లోని బాలానగర్ డిసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్వోటి డిసిపి శ్రీనివాస్ ఎస్వోటి అడిషనల్ డిసిపి శోభన్ అడిషనల్ డిసిపి సత్యనారాయణ బాలానగర్ ఏసిపి హనుమంతరావు జీడిమెట్ల సీఐ మల్లేష్ ల తో కలిసి బాలానగర్ జోన్ డిసిపి సురేష్ కుమార్ మీడియాకు నిందితుల వివరాలు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన కామేశ్వర రావు పుల్లా రావు సాంబ శివ రావు లు గతంలో వివిధ పోలీస్ స్టేషన్ ల పరిధిలో ఫేక్ కరెన్సీ నకిలీ బంగారం చలామణి చేస్తూ పలు పోలీస్ స్టేషన్ ల పరిధిలో అరెస్టై జైలుకు వెళ్లారు. జైలు నుండి బయటకు వచ్చిన వీరు వారి పంథాను మార్చుకోకుండా మళ్లీ అదే తప్పు దారిలో నడుస్తూ మళ్లీ ఫేక్ బంగారం అమ్ముతామంటూ దందా ప్రారంభించారు. సైబరాబాదు పోలీసుల ఆపరేషన్ లో తాండూర్ కు చెందిన అంజలికి తనకు పరిచయం ఉన్న సంధ్యా అనే మహిళ మహేష్ అనే వ్యక్తి ఆంధ్రా నుండి తక్కువ ధరకే బంగారం ఇస్తున్నాడని మహేష్ నంబర్ ను అంజలికి ఇచ్చింది. దీంతో ఆ నెంబర్ కు అంజలి ఫోన్ చేయగా మార్కెట్ ధర కన్నా పదివేల రూపాయలు తక్కువకే ఇస్తామని మహేష్ అంజలిని నమ్మబలికాడు బంగారం కావాలంటే విజయవాడ కు రావాలని తెలిపాడు. దీంతో అంజలి అక్కడికి అంత దూరం మేము రాలేమంటూ ఫోన్ లో కరాఖండిగా చెప్పి వదిలేసింది. ఆ తర్వాత అందరికీ ఫోన్ చేసిన మహేష్ హైదరాబాద్ కు మేమే వస్తాము కానీ అర కేజీ బంగారం తప్పకుండా కొంటే నే వస్తామంటూ మహేష్ చెప్పాడు. సరే అన్న అంజలి ఆమె స్నేహితురాళ్ళు భాను రేఖ ప్రభావతి లకు విషయం చెప్పి తక్కువ ధరకే బంగారం వస్తుంది కదా అని ఆశపడి కొనేందుకు గోల్డ్ స్మిత్ ప్రవీణ్ సహాయంతో షాపూర్ నగర్ కు చేరుకున్నారు. షాపూర్ నగర్ లోని ఓ హొటల్ గదిలో రూమ్ నెంబర్ 306లో అప్పటికే మకాం వేసిన ఫేక్ బంగారం విక్రయదారులు అంజలి బృందానికి ఫేక్ నాణేలు చూపించారు. నాణాలను తనిఖీ చేసిన గోల్డ్ స్మిత్ ప్రవీణ్ అది బంగారం కాదు నకిలీ అని గుర్తించాడు. వెంటనే అంజలి బృందం బాలానగర్ ఎస్ఓటి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో రంగంలోకి దిగిన ఎస్ఓటి పోలీసులు జీడిమెట్ల పోలీసులు సంయుక్తంగా దాడులు జరిపి నకిలీ నాణాలను బంగారం అంటూ అమ్ముతున్న ముగ్గురు ముఠా సభ్యులను అదుపులోకి తీసుకున్నారు. తమదైన శైలిలో పోలీసులు విచారించగా వారి బండారాన్ని బయటపెట్టారు. గతంలో ఈ నిందితులపై భద్రాచలం ఖమ్మం గుంతకల్ మలక్ పేట్ ఘట్కేసర్ మేడ్చల్ పోలీస్ స్టేషన్ లలో కేసులు నమోదై జైలుకు వెళ్లారని పోలీసుల దర్యాప్తులో తేలింది. ఈ ముఠా వద్ద నుండి ఒక్కొక్కటి 20 గ్రాముల చొప్పున 100 ఫేక్ బంగారం నాణేలు 29 లక్షల నగదు, ఆరు సెల్ ఫోన్లు షిఫ్ట్ కారు స్వాధీనం చేసుకున్నామని పోలీసులు తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించినట్లు డిసిపి సురేష్ మీడియాతో వెల్లడించారు.

# పాడైన రోడ్లపై వరి నాట్లు నాటి నిరసన తెలిపిన బౌరంపేట గ్రామ మహిళలు





**మున్సిపల్ కమిషనర్ కు పాలనపై అవగాహన లేదంటూ గ్రామస్థుల ఆగ్రహం**

**డ్రైనేజీ కోసం తవ్వి వదిలేయడం తోనే ఈ దుస్థితి అంటూ నిరసన**

**షణ్ముఖ వెలుగు కుత్బుల్లాపూర్ ప్రతినిధి జూలై 20** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ బౌరంపేట గ్రామంలో అధ్వానంగా మారిన రోడ్లపై వరినాట్లు నాటి ప్రజలు వినూత్న నిరసన తెలిపారు మూడు నెలల క్రితం గ్రామంలో ప్రధాన రహదారి తోపాటు వీధుల్లో డ్రైనేజీ ఏర్పాటు కోసం తవ్విన రోడ్డు ను తిరిగి వేయకపోవడం తో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు రహదారులన్నీ బురదతో నిండి అధ్వాన్నంగా మారాయి గుంతల మయంగా ఉన్న రోడ్డు వలన ఇబ్బంది పడుతున్న ప్రజలు గ్రామంలోని గుంతల్లో శనివారం భారీ వర్షాన్ని సైతం లెక్కచేయకుండా గ్రామ మహిళలు వరినాట్లు నాటి మున్సిపల్ కమీషనర్ పాలకుల పనితీరుపై నిరసన తెలిపారు. ఇందుకేనా మేము మీకు ఓట్లు వేసి గెలిపించుకుంది ఇందుకేనా మేము పన్నులు చెల్లిస్తూ మీకు నెల నెలా వేతనాలు అందిస్తుంది అంటూ అధికారులు పాలకులపై తీరుపై మండిపడ్డారు గ్రామంలో రోడ్లు బురద మయంగా మారి అధ్వాన్నంగా తయారు కావడంతో వృద్ధులు పిల్లలు మహిళలు బయటకు రాలేక ఇబ్బందులు పడుతున్నామన్నారు.డ్రైనేజీ కోసం తవ్విన రోడ్లను తిరిగి నిర్మించకపోవడంతో వాహనాలు మట్టిలో కూరుకు పోతుండడం ఆందోళన కలిగించే విషయం మున్సిపల్ కమీషనర్ కు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు వర్షాకాలంలో రోడ్డుపై ప్రయాణం నరకప్రాయంగా మారిందంటున్నారు శనివారం కురిసిన భారీ వర్షాన్ని సైతం లెక్క చేయకుండా మహిళలు బయటకు వచ్చి నిరసన వ్యక్తం తెలిపారు.

**అధ్వాన్నంగా మారిన ప్రధాన రహదారి**

మూడు నెలల క్రితం డ్రైనేజీ కోసం తవ్వి వదిలేయడంతో గ్రామంలోని ప్రధాన రహదారి బురదతో నిండి అధ్వాన్నంగా మారిందని మున్సిపల్ కమీషనర్ కె.సత్యనారాయణకు ఫిర్యాదు చేశామని ఆర్ అండ్ బి రోడ్డు అంటూ పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు బురదలో ద్విచక్ర వాహనాలు అదుపు తప్పుతూ యాక్సిడెంట్ లు అవుతుండడం ఆందోళన కలిగించే విషయమని మండిపడ్డారు.రోడ్డు సమస్యపై దుండిగల్ కమిషనర్ కల్వకుంట్ల సత్యనారాయణ ను వివరణ కోరగా అది ఆర్ అండ్ బి రోడ్డు అని ఎన్నికల కోడ్ వలన రోడ్డు వేయ లేకపోయారని నిధులు మంజూరై కాంట్రాక్టర్ కు అలాట్ అయిందని త్వరలో రోడ్డు వేస్తామని తెలిపారు.

# సిఐటియులో చేరిన జమ్మికుంట మండల ట్రాలీ డ్రైవర్స్

**రవాణా రంగ కార్మికుల సమస్యలపై ఈనెల 23న జిల్లా సదస్సు విజయవంతం చేయండి**

**జమ్మికుంట మండలం ట్రాలీ ట్రాన్స్ పోర్ట్ డ్రైవర్స్ 200 మంది సిఐటియు లో చేరిక**



**షణ్ముఖ వెలుగు జమ్మికుంట ప్రతినిధి జూలై 20** కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలం ట్రాలీ ట్రాన్స్ పోర్ట్ డ్రైవర్స్ 200 మంది సిఐటియు లోకి కండువాలు కప్పి ఆహ్వానించిన కరీంనగర్ జిల్లా పబ్లిక్ ప్రైవేటు రోడ్డు ట్రాన్స్ పోర్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు పున్నం రవి ఆధ్వర్యంలో జమ్మికుంట మండలం ట్రాలీ డ్రైవర్స్ రెండు వందల మందిని కండువాలు కప్పి సిఐటియూ యూనియన్ లోకి ఆహ్వానించారు ఈనెల 23న రవాణా రంగ కార్మికులకు సమస్యలపై జిల్లా సదస్సును కరీంనగర్ జిల్లా కోతి రాంపూర్ ముకుంద లాల్ మిశ్రా భవన్ సిఐటియు కార్యాలయంలో ఉంటుందని దీనికి జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆటో టాటా ఏసీ ట్రాలీ లారీ బస్సు రెడీ మిక్స్ కారు ల యూనియన్ ల కమిటీలు కమిటీ సభ్యులు చొప్పదండి శంకరపట్నం హుజురాబాద్ గంగాధర తిమ్మాపూర్ కొత్తపల్లి గన్నేరువరం మండలాల్లో అధ్యక్షులు కార్యదర్శులు కమిటీ సభ్యులు హాజరు కావాలని అన్ని రకాల వాహన డ్రైవర్లు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మోటారు రవాణా రంగ కార్మికులను పట్టించుకోవడం లేదని వీరికి సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి ఆదుకోవాలని ప్రభుత్వం ద్వారా వచ్చే పథకాలు వీరికి అందే విధంగా చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు డ్రైవర్లకు ఉరితాడు గా మారిన హిట్ అండ్ రన్ చట్టాన్ని రద్దు చేయాలని పెట్రోల్ డీజిల్ ఇన్సూరెన్స్ ఫిట్నెస్ ధరలు తగ్గించాలని 5 లక్షల ప్రమాద బీమా ఏ షరతు లేకుండా వెంటనే అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు ఈనెల 23న జరిగే రవాణా రంగ కార్మికుల సమస్యలపై జిల్లా సదస్సు లో చర్చించి భవిష్యత్తు కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు ఈ కార్యక్రమంలో ట్రాన్స్ పోర్ట్ జిల్లా ప్రధాన కార్యదర్శి చెలికాని శ్రీనివాస్ జమ్మికుంట మండలం ట్రాలీ అడ్డా అధ్యక్షులు మౌటం రఘు ప్రధాన కార్యదర్శి పూలవేన కుమార్ కోశాధికారి పర్లపల్లి పవన్ ఉపాధ్యక్షులు బత్తుల సతీష్ కుక్కల సతీష్ ముఖ్య సలహాదారులు కటికర కుమారస్వామి బోలవేన తిరుపతి గిరి వేన శంకర్ రావుల మధు కార్యవర్గ సభ్యులు అప్పల బిక్షపతి సుద్దాల నాని ఉడుత మహేందర్ జక్కుల రమేష్ మరిజె సంతోష్ అంబాల అరుణ్ పైతరి రవి గూండ్ల కుమారస్వామి పోనగంటి విజయ్ పుట్టకోక్కల కుమార్ కన్నూరి సాగర్ రేణికుంట్ల దేవదాసు వడిజె నాగరాజు తదితరులు పాల్గొన్నారు

## తెలంగాణ ప్రభుత్వ సలహాదారు కే కేశవరావును సన్మానించిన కొమిరెడ్డి కరంచంద్



**షణ్ముఖ వెలుగు మెట్ పల్లి ప్రతినిధి జూలై 20** హైదరాబాద్ సచివాలయంలో నూతనంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు గా బాధ్యతలు స్వీకరించిన కె.కేశవరావు ను మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియచేసిన సుప్రీం కోర్టు న్యాయవాది రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు కొమిరెడ్డి కరంచంద్ తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ కన్వీనర్ భాను చందర్

## సాధారణ బదిలీల్లో కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు అవకాశం కల్పించాలి

**పిఆర్ టి యు భూపాలపల్లి జిల్లా అధ్యక్షులు రాచర్ల శ్రీనివాస్**



**షణ్ముఖ వెలుగు మహాదేవ్ పూర్ ప్రతినిధి జూలై 20** మహాదేవ్ పూర్ మండల కేంద్రంలోని బ్రాహ్మణ పల్లి ఎంపిపిఎస్ యస్.కాలనీ పాఠశాలలో జరిగిన కార్యక్రమములో జయశంకర్ భూపాలపల్లి జిల్లా పి ఆర్ టి యు టి యు తెలంగాణ అధ్యక్షులు రాచర్ల శ్రీనివాస్ మాట్లాడుతూ బదిలీల్లో నష్టపోయిన ఉపాధ్యాయులను గుర్తించి వారికి సత్వరమే న్యాయం చేయాలని పదోన్నతుల్లో మిగిలిన పోస్టులను కూడా పదోన్నతుల ద్వారా భర్తీ చేయాలని అలాగే ప్రభుత్వం సాధారణ బదిలీలు చేపట్టిన నేపథ్యంలో విద్యాశాఖలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు కూడా ఈ సాధారణ బదిలీల్లో అవకాశం కల్పించాలని ఎంతో కాలంగా ఒకే ప్రాంతంలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులు ఎన్నో ఇబ్బందులకు గురవుతున్నారు. కావున పది సంవత్సరాలుగా ఒకే చోట పనిచేస్తున్న వారిని వేరే ప్రాంతాలకు బదిలీ చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పసుల శంకర్ నేత జిల్లా సహ అధ్యక్షులు మంద రమేష్ రాజ్ కుమార్ జిల్లా బాధ్యులు కురసం అశోక్ శరత్ మల్లేశం పెంటి శ్యామ్ సునీత తదితర ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఇంటి పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచండి

**జమ్మికుంట మున్సిపల్ కమిషనర్ ఎండి ఆయాజ్**




**షణ్ముఖ వెలుగు జమ్మికుంట ప్రతినిధి జూలై 20** జమ్మికుంట మున్సిపల్ కమిషనర్ ఎండి ఆయాజ్ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల గురించి కమిషనర్ ఎండి ఆయాజ్ మాట్లాడుతూ ఇంటి పరిసర ప్రాంతాలలో నీరు నిల్వ ఉండకుండా చూడాలని పాత టైర్లు కొబ్బరి బోండాలు లాంటి వాటిలో నీరు నిల్వ ఉండి దోమలు గుడ్లు పెట్టి సంతానాన్ని ఉత్పత్తి చేస్తాయని ఆ దోమల వలన అనేక వ్యాధులు ప్రభలుతాయని ఎల్లప్పుడూ ఇంటి పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ముఖ్యంగా హౌసింగ్ బోర్డు లాంటి లోతట్టు ప్రాంతాల వారు వర్షాలు పడినప్పుడు మురికి కాలువల గుండా వర్షపు నీరు ప్రవాహం ఎక్కువై ఇళ్లల్లోకి వచ్చే అవకాశాలు ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ సిబ్బంది ఎల్లవేళలా అందుబాటులో ఉంటారని ఏదైనా ఇబ్బంది తలెత్తినప్పుడు మున్సిపల్ కార్యాలయానికి సమాచారం ఇవ్వాలని జమ్మికుంట ప్రజలకు మున్సిపల్ కమిషనర్ ఎండి ఆయాజ్ సూచించారు

## రెండు లక్షల రైతు రుణమాఫీతో రైతన్నల సంబరాలు




**షణ్ముఖ వెలుగు మెట్ పల్లి ప్రతినిధి జూలై 20** రైతులకు రెండు లక్షల రుణ మాఫీ ప్రారంభించి రాష్ట్రంలో రైతు కుటుంబానికి సీఎం రేవంత్ రెడ్డి పెద్ద కొడుకు అయ్యారని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొమిరెడ్డి కరంచంద్ అభివర్ణించారు. ఆయన ఆదేశాల మేరకు శనివారం మెట్ పల్లి లోని ఆయన నివాస ప్రాంగణంలో రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు విజయ్ ఆజాద్ పార్టీ నాయకులు సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలతో అభిషేకం చేసి హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు విజయ్ ఆజాద్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ సీఎం రేవంత్ రెడ్డి సాహసోపేతమైన నిర్ణయం తీసుకుని రైతులపై తన చిత్తశుద్ధిని నిరూపించుకున్నారని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు జెట్టి లింగం రైతు నాయకులు కటకం గంగారెడ్డి ఎర్రోళ్ల హనుమాండ్లు యాదవ్ అల్లూరు లింగారెడ్డి న్యాయవాదులు సురభి అశోక్ లీగల్ సెల్ కన్వీనర్ ఎల్మల రాంబాబు బోయిని హనుమాండ్లు జవిడి రాజారెడ్డి దోనోజు వెంకటేష్ అంబటి మల్లారెడ్డి కృష్ణమూర్తి పొన్న మురళి తాండ్ర నర్సయ్య పొట్ట గోపి బర్ల వంశీ పొన్నాల ఎల్లేష్ సాయన్న కాజా అజీమ్ ఖాలీద్ కంతి హరి కుమార్ తదితరులు పాల్గొన్నారు

## రైతుల పక్షపాతి కాంగ్రెస్ ప్రభుత్వం



**షణ్ముఖ వెలుగు తిరుమలాయపాలెం ప్రతినిధి జూలై 20** కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పక్షపాతి అని ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీ లను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ముందంజలో ఉందని మండల యూత్ కాంగ్రెస్ నాయకులు షేక్ నజీర్ అన్నారు. రైతు ఋణమాఫీ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పక్షపాతి ప్రభుత్వం అని ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీల అమలులో భాగంగా రెండు లక్షల రుణమాఫీని చేయబోతున్నామని తెలిపారు, యాదగిరి లక్ష్మీనరసింహస్వామి సాక్షిగా ఆగస్టు 15 లోపు రుణమాఫీ చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారని ప్రకటించిన తేదీ లోపే సంపూర్ణంగా రుణమాఫీ చేస్తున్నామని తెలిపారు. రైతును రాజును చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు గత ప్రభుత్వం రైతులకు మాయమాటలు చెప్పి మోసం చేసిందన్నారు. టిఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన రుణ మాఫీ వడ్డీలకు కూడా సరిపోలేదని విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డి లక్షలోపు ఉన్న రైతులకు నేరుగా తమ అకౌంట్ లో జమ చేయడం జరుగిందని లక్ష యాభై వేల రూపాయల వరకు ఈ నెల చివరి వరకు వచ్చే నెల మొదటి వారానికి రెండు లక్షల రుణమాఫీని పూర్తి చేస్తారని తెలిపారు. ఈ ఋణమాఫీ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క రెవిన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు లకు రైతులు ఋణపడి ఉంటారన్నారు.

# అడవులు, జలపాతాల వద్ద పర్యాటక అభివృద్ధికి చర్యలు చేపట్టండి

-మొదటిపేజీ తరువాయి

సీఎం బట్టి విక్రమార్క మల్లు ఆరా తీశారు. కళాకారులను సమాజ అభివృద్ధికి పూర్తిగా వాడుకోవడం లేదు.. వారి సేవలు వినియోగించుకునేందుకు ఓ ప్రణాళిక రూపొందించాలని అధికారులను ఆదేశించారు. గత ప్రభుత్వం పదేళ్ల కాలంలో అనేక నిర్మాణాలు ప్రారంభించి మధ్యలో వదిలేసింది.. ఫలితంగా వందలాది కోట్ల రూపాయల ప్రజాధనం నిరుపయోగమైంది. గతంలో ప్రారంభించి 90 శాతం పూర్తి చేసిన భవనాలను గుర్తించి నిర్మాణాలు పూర్తి చేయండి, మిగిలిన భవనాలు దశలవారీగా పూర్తి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో పెద్ద సంఖ్యలో క్రీడామైదానాలు ఉన్నాయి. వాటిని నిరుపయోగంగా ఉంచడం మూలంగా ఆక్రమణలు జరుగుతున్నాయి.. అధికారులు వెంటనే స్పందించి.. నిత్యం క్రీడలు నిర్వహించి... మైదానాలను ఉపయోగించుకోవాలని ఆదేశించారు. రాష్ట్రంలోని రెసిడెన్షియల్ విద్యార్థులకు క్రీడా మైదానాల్లో క్రీడలు నిర్వహించే ఏర్పాట్లు చేయాలని సూచించారు. కొన్నిచోట్ల క్రీడామైదానాలు ఆక్రమణలకు గురైనట్టుగా సమాచారం ఉంది.. వెంటనే ఆ విషయాలపై దృష్టి సారించి ఆక్రమణ దారులను ఖాళీ చేయించండి ప్రభుత్వ ఆస్తులను కాపాడాలని డిప్యూటీ సీఎం అధికారులను



ఆదేశించారు. ఏడాది మొత్తంగా ప్రభుత్వ క్రీడా మైదానాల్లో యాక్టివిటీ ఉండేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. పర్యాటక శాఖ సొంత ఆస్తులు, లీ జ్ లో ఉన్న ఆస్తుల వివరాలపై ఒక సమగ్ర నివేదిక ప్రభుత్వానికి సమర్పించాలని సంబంధిత అధికారులను డిప్యూటీ సీఎం ఆదేశించారు. ఔటర్ రింగ్ రోడ్డు, భారీ నీటిపారుదల ప్రాజెక్టులు, అడవులను పర్యాటక సాంస్కృతిక శాఖలు పెద్ద సంఖ్యలో వినియోగించుకుని ఆదాయం పెంచుకోవాలని సూచించారు.

కల్చర్ అంటే ఆటలు పాటలు అనుకుంటున్నారు.. కానీ కల్చర్ అంటే జీవన విధానం అని చాలామందికి తెలియదని పర్యాటక శాఖ మంత్రి చూపల్లి కృష్ణారావు అన్నారు. కళాకారులు ప్రజల జీవన విధానంలో మెరుగైన మార్పులు తెచ్చేందుకు.. తీసుకునే ఆహారం, వేసుకునే దుస్తులు ఇలా అన్ని అంశాల పైన గ్రామీణ ప్రజానీకాన్ని చైతన్యం చేయాల్సిన అవసరం ఉందని మంత్రి జూపల్లి అన్నారు. రాష్ట్రంలో ఉన్న చెక్ పోస్ట్ లను పూర్తిస్థాయిలో ఆధునికీకరించేందుకు సమగ్ర ప్రణాళికలు చేయాలని అధికారులను మంత్రి జూపల్లి ఆదేశించారు. రాష్ట్రంలో సంస్కృతి, వారసత్వ సంపదలు ఘనంగా ఉన్న ఆ మేరకు వాటిని వినియోగించుకుని పూర్తిస్థాయిలో ఫలితాలు సాధించలేకపోతున్నాం, రాబోయే రోజుల్లో జాతీయ, అంతర్జాతీయ పర్యాటకులను పెద్ద సంఖ్యలో ఆకర్షించేందుకు దృష్టి సారించాలని మంత్రి జూపల్లి ఆదేశించారు. సమావేశంలో స్పెషల్ చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, వాణిజ్య పన్నుల శాఖ ఉన్న తాధికారి వాం రిజ్వి, జయఅ ప్రిన్సిపల్ సెక్రెటరీ వాణి ప్రసాద్, డిప్యూటీ సీఎం స్పెషల్ సెక్రటరీ కృష్ణ భాస్కర్, యూత్ సర్వీసెస్ డైరెక్టర్ వాసం వెంకటేశ్వర్లు, ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారి శ్రీధర్, ఆర్కియాలజీ డైరెక్టర్ భారతి హోలికేరి, టూరిజం కార్పొరేషన్ ఎండి ప్రకాష్ రెడ్డి, టూరిజం కార్పొరేషన్ డైరెక్టర్ ఇలా త్రిపాఠి తదితరులు పాల్గొన్నారు.

# రాజ్యాంగాన్ని కాపాడండి...

-మొదటిపేజీ తరువాయి

లేదని గవర్నర్ దృష్టికి తీసుకెళ్లారు. పరీక్షలు వాయిదా వేస్తే కోచింగ్ సెంటర్లకు వందల కోట్లు లాభం అని పేర్కొన్న సీఎం రేవంత్ రెడ్డి.. ఇప్పుడు ఎగ్జామ్స్ 4 నెలలు వాయిదా వేశారంటే, 4 వందల కోట్లు వస్తాయా ? అందులో సీఎం రేవంత్ వాటా ఎంత ? అని కేటీఆర్ ప్రశ్నించారు. గవర్నర్ సీపీ రాధాకృష్ణన్‌కు ఫిర్యాదు చేసిన అనంతరం మాజీ మంత్రి కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ.. 'రాష్ట్రంలో రాజ్యాంగంపై జరుగుతున్న దాడి, కాంగ్రెస్ మోసపూరిత హామీలు, ఇతర అంశాలను గవర్నర్ రాధాకృష్ణన్ దృష్టికి తీసుకెళ్లాం. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, పార్టీ ఎమ్మెల్సీలు కొందరితో వెళ్లి గవర్నర్‌ను కలిశాం. కాంగ్రెస్ పార్టీ నిరుద్యోగ యువత, గ్రూప్స్ అభ్యర్థులకు ఇచ్చిన హామీలను ఎలా తుంగలో తొక్కి, మోసం చేస్తుందో గవర్నర్ దృష్టికి తీసుకెళ్లాం. హామీలు అమలు చేయాలని నిరసన తెలిపిన విద్యార్థుల నిర్బంధం, అణిచివేత, అక్రమ అరెస్టులు, అక్రమ కేసులతో రాష్ట్రంలో భయానక వాతావరణం కల్పించారని ఫిర్యాదు చేశాం. చిక్కడపల్లి సిటి సెంట్రల్ లైబ్రరీలో, ఉస్మానియా యూనివర్సిటీలో విద్యార్థులు, నిరుద్యోగులపై పోలీసులు లాఠీఛార్జ్ చేస్తూ ఉద్యమం నాటి అణిచివేత వైఖరిని కాంగ్రెస్ ప్రభుత్వం మళ్లీ అవలంభిస్తోంది. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే మొదటి ఏడాదిలో 2 లక్షల ఉద్యోగాలు కల్పన, జాబ్ క్యాలెండర్ విడుదలకు సంబంధించి ఇచ్చిన ప్రకటనలు, హామీలను గవర్నర్ కు తెలియజేశాం. తెలంగాణలో గ్రూప్ 1, 2, 3 పోస్టులు పెంచుతామన్న హామీలు పట్టించుకోవడం లేదు. రాష్ట్రంలో రాజ్యాంగం



అమలు కావడం లేదని, బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను భయపెట్టి కాంగ్రెస్ లో చేర్చుకుంటున్నారని గవర్నర్ కు తెలిపాం. విద్యార్థులు, నిరుద్యోగులపై లాఠీఛార్జ్ లు, అక్రమ అరెస్టులపై సైతం గవర్నర్ సీరియస్ అయ్యారని కేటీఆర్ తెలిపారు. హోం శాఖ కార్యదర్శిని పిలిచి వివరాలు అడుగుతానని గవర్నర్ చెప్పారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా నెగ్గిన దానం నాగేందర్ మళ్లీ కాంగ్రెస్ అభ్యర్థిగా ఎంపీగా పోటీ చేసినట్లు, స్పీకర్ గారికి కూడా ఫిర్యాదు చేశామని గవర్నర్ దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యేల హక్కులకు భంగం వాటిల్లవద్దని గవర్నర్ అన్నారు. ఈ విషయంపై ప్రభుత్వాన్ని వివరణ ఇవ్వాలని లేఖ రాస్తా అని చెప్పారని కేటీఆర్ తెలిపారు. రాజ్యాంగాన్ని రక్షిస్తున్నట్లు రాహుల్ గాంధీ పోజులు కొడుతూ, మరోవైపు వేరే పార్టీ ఎమ్మెల్యేల్ని కాంగ్రెస్ లో చేర్చుకుంటున్నారని కేటీఆర్ మండిపడ్డారు. రాజ్యాంగ విరుద్ధమైన చర్యలను గవర్నర్ తో పాటు, రాష్ట్రపతికి కూడా ఫిర్యాదు చేస్తామన్నారు. తన పరిధిలో ఏ అంశంలో అయినా న్యాయం చేస్తామని గవర్నర్ అన్నారని కేటీఆర్ తెలిపారు. రాష్ట్రంలో నిరుద్యోగులకు బీఆర్ఎస్ అండగా ఉంటుందన్నారు. కాళేశ్వరంలో లక్ష కోట్లు గంగ పాలు అయ్యిందని, ఇక మేడిగడ్డ కొట్టుకు పోయిందని దుష్ప్రచారం చేసిన కాంగ్రెస్ ఇప్పుడు సిగ్గుతో తల దించుకోవాలన్నారు. కొన్ని రోజుల్లోనే రిపేర్లు పూర్తి కావడంతో వరద లాగ నీళ్లు వస్తున్న మేడిగడ్డ తట్టుకోవటమంటే అదే కాళేశ్వరం గొప్పతనం అన్నారు. త్వరలోనే మేడిగడ్డను సందర్శించి ప్రజలకు వాస్తవాలను వివరిస్తామని కేటీఆర్ పేర్కొన్నారు.

# సివిల్స్ అభ్యర్థులకు చేయుత

**సివిల్స్ అభ్యర్థులకు రూ.లక్ష ఆర్థిక సాయం**

**'రాజీవ్‌గాంధీ సివిల్స్ అభయహస్తం' పథకం కింద ప్రిలిమ్స్ పాసైన అభ్యర్థులకు రూ.లక్ష ఆర్థిక సాయం**


**సింగరేణి సంస్థ ద్వారా ఈ సాయాన్ని ఇవ్వనున్న సీఎం రేవంత్ రెడ్డి**

**మెయిన్స్‌కు ఎంపికైన అభ్యర్థులు కచ్చితంగా ఉద్యోగం సాధించాలి**

**సివిల్స్ సాధించి మన రాష్ట్రానికే రావాలి**

**ఐఏఎస్, ఐపీఎస్‌లు మన వారైతే రాష్ట్రానికి మంచి జరుగుతుంది**

**హైదరాబాద్ :** తెలంగాణ ప్రభుత్వం సివిల్స్ అభ్యర్థులకు గుడ్ న్యూస్ చెప్పింది. 'రాజీవ్‌గాంధీ సివిల్స్ అభయహస్తం' పథకం కింద ప్రిలిమ్స్ పాసైన అభ్యర్థులకు రూ.లక్ష ఆర్థిక సాయం అందించనుంది. సింగరేణి సంస్థ ద్వారా ఈ సాయాన్ని ఇవ్వనున్నారు. సీఎం రేవంత్ రెడ్డి శనివారం ప్రజాభవన్‌లో ఈ పథకాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు సీతక్క, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, సీఎస్ శాంతికుమారి, సింగరేణి సీఎండీ బలరామ్ పాల్గొన్నారు. సివిల్స్ అభ్యర్థులను ప్రోత్సహించడానికి



ప్రభుత్వం తరపున సాయం చేస్తున్నామని సీఎం రేవంత్ తెలిపారు. మెయిన్స్‌కు ఎంపికైన అభ్యర్థులు కచ్చితంగా ఉద్యోగం సాధించాలని ఆకాంక్షించారు. సివిల్స్ సాధించి మన రాష్ట్రానికే రావాలని.. ఐఏఎస్, ఐపీఎస్‌లు మన వారైతే రాష్ట్రానికి మంచి జరుగుతుందని అన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ నుంచి సివిల్స్ 2024లో విజయం సాధించిన అభ్యర్థులకు జ్ఞాపికను అందజేశారు. అభ్యర్థులు తెలంగాణకు చెందిన వారై ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్ (ఈడబ్ల్యూఎస్ కోటా) సామాజిక వర్గాలకు చెందిన వారై ఉండాలి. యూపీఎస్సీ నిర్వహించిన సివిల్స్ ప్రిలిమ్స్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించాలి. కుటుంబ వార్షిక ఆదాయం రూ.8 లక్షల లోపు మాత్రమే ఉండాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల శాశ్వత ఉద్యోగులు అనర్హులు. గతంలో ఈ పథకం ద్వారా ప్రయోజనం పొంది ఉండకూడదు. ప్రిలిమ్స్ పాసైన అభ్యర్థులు వారి ప్రయత్నంలో ఒకే ఒకసారి మాత్రమే ఈ ఆర్థిక సాయం పొందే వీలుంటుంది. కాగా, దేశవ్యాప్తంగా దాదాపు 14 లక్షల మంది సివిల్స్ ప్రిలిమ్స్ పరీక్షలు రాస్తున్నట్లు అంచనా. తెలంగాణ నుంచి దాదాపు 50 వేల మంది సివిల్స్ ప్రిలిమ్స్ పరీక్షకు దరఖాస్తు చేసుకుంటున్నట్లు తెలుస్తుండగా.. దాదాపు 400 నుంచి 500 మంది వరకూ ప్రిలిమ్స్‌లో అర్హత సాధిస్తున్నట్లు అంచనా. వీరికి ప్రభుత్వ ఆర్థిక సాయం అందనుంది. ఈ సందర్భంగా జాబ్ క్యాలెండర్‌పై సీఎం రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. ఇక నుంచి ప్రతీ ఏటా మార్చిలోగా అన్ని శాఖల్లో ఖాళీల వివరాలు తెప్పించుకుంటామని.. జూన్ 2లోగా నోటిఫికేషన్ వేసి డిసెంబర్ 9లోగా నియామక ప్రక్రియ పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఉద్యోగాల కోసమే ప్రత్యేక రాష్ట్రాన్ని పోరాడి సాధించుకున్నామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించడమే ప్రభుత్వ ప్రాధాన్యత అని.. అధికారంలోకి వచ్చిన 3 నెలల్లో 30 వేల ఉద్యోగ నియామక పత్రాలు అందించినట్లు వివరించారు. పరీక్షలు మాటిమాటికీ వాయిదా పడడం మంచిది కాదని.. నిరుద్యోగుల ఇబ్బందులను గుర్తించి గ్రూప్ – 2 పరీక్ష వాయిదా వేసినట్లు చెప్పారు. గ్రూప్ 1, 2, 3, పోలీస్, డీఎస్సీ, టెట్ ఇలా పరీక్ష ఏదైనా సరైన సమయంలో సమర్థంగా నిర్వహించాలనేదే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు

# కర్నాటకలో భారీ వర్షాలు

**శ్రీశైలం జలాశయానికి భారీగా వచ్చి చేరుతున్న వరద నీరు**

**శ్రీశైలం జలాశయానికి జూరాల నుంచి నీటిని వదిలిన అధికారులు**



**హైదరాబాద్ :** కర్నాటకలో భారీ వర్షాలు కురుస్తుండడంతో కృష్ణా నదిలోకి వరద నీరు వచ్చి చేరుతోంది. శ్రీశైలం జలాశయానికి భారీ వరద నీరు చేరుతోంది. శ్రీశైలం జలాశయానికి జూరాల నుంచి నీటిని అధికారులు వదిలారు. జూరాల రిజర్వాయర్ నుంచి స్పిల్ వే ద్వారా 19,615 వేల క్యూసెక్కులు, జల విద్యుత్ ద్వారా 37వేల 250 క్యూసెక్కుల చొప్పున 56, 865 క్యూసెక్కుల నీటిని దిగువకు అధికారులు వదిలారు. తెలంగాణలో గత రాత్రి నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఉమ్మడి ఖమ్మం, ఉమ్మడి వరంగల్, నల్గొండ, ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, పెద్దపల్లి జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్నారు. వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. రోడ్లన్నీ జలమయంగా మారాయి. ఇన్ ఫ్లో : 70,000 క్యూసెక్కులు, ఔట్ ఫ్లో : 56,865 క్యూసెక్కులు, పూర్తిస్థాయి నీటి సామర్థ్యం: 318.516 మీటర్లు, ప్రస్తుత నీటి సామర్థ్యం: 317.420 మీటర్లు, పూర్తిస్థాయి నీటి నిల్వ: 9.657 టీఎంసి, ప్రస్తుత నీటి నిల్వ : 7.498 టీఎంసిఎగువ, దిగువ జూరాల జల విద్యుత్ కేంద్రాలలో 10 యూనిట్లలో 395 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతోంది.

## హెరాయిన్ సరఫరా చేస్తున్న వ్యక్తిని అరెస్టు చేసిన మేడిపల్లి పోలీసులు



**షణ్ముఖ వెలుగు మేడిపల్లి ప్రతినిధి జూలై 21** మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని బోడుప్పల్ గాయత్రీ నగర్ ఏరియాలో పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా ద్విచక్ర వాహనం మీద వస్తున్న ఒక వ్యక్తిని పట్టుకుని విచారించగా అతని దగ్గర పరిశీలించి చూడగా ప్రభుత్వం నిషేధించబడిన దాదాపు 10 గ్రాముల హెరాయిన్ దొరికింది. వెంటనే అట్టి వ్యక్తిని ద్విచక్ర వాహనాన్ని అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్ కు తరలించి విచారించగా అతని పేరు దినేష్ కుమార్ బీష్నోయ్ అతని తండ్రి పేరు రఘునాథ్ వయసు 27 సంవత్సరాలు అని తెలుపగా చట్టప్రకారం అతని పై కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించారు ఈ సందర్భంగా మేడిపల్లి ఇన్ స్పెక్టర్ యువతను హెచ్చరిస్తూ సూచనలు చేస్తూ మత్తు పదార్థాలకు గంజాయి కి మరియు డ్రగ్స్ కు యువత దూరం గా ఉండాలని మత్తు పదార్థాల వినియోగం కారణంగా జీవితాలు దుర్భరమవుతున్నాయని యువత మత్తు పదార్థాలకు బానిసలై తమ జీవితాలను పాడు చేసుకుంటున్నారని ఇందుకు కారణమవుతున్న డ్రగ్స్ పై ఉక్కుపాదం మోపుతామని హెచ్చరించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో ఇప్పటికే బృందాలుగా ఏర్పడి ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు సీఐ తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో మత్తు పదార్థాలు లేకుండా చేయాలన్నదే తమ ధ్యేయమన్నారు. యువత మత్తు పదార్థాలకు బానిసలుగా మారి తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దన్నారు. తల్లిదండ్రులు మానసిక క్షోభకు గురి కాకుండా చూడాలన్నారు. ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి గంజాయి డ్రగ్స్ మరియు మత్తు పదార్థాల విక్రయాలకు పాల్పడే వారి సమాచారాన్ని ఇవ్వాలని ఆయన కోరారు.

## సఫాయి అప్నావో బిమారీ భగావో కార్యక్రమాన్ని ప్రారంభించిన మేయర్



**షణ్ముఖ వెలుగు మేడిపల్లి ప్రతినిధి జూలై 21** పరిశుభ్రమైన మరియు వ్యాధి రహిత వాతావరణాన్ని కలిగి ఉండటానికి పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో "సఫాయి అప్నావో బిమారీ భగావో" కార్యక్రమాన్ని మేయర్ జక్క వెంకట్ రెడ్డి ప్రారంభించారు. స్వచ్ఛ భారత్ మిషన్ (ఎస్‌బీఎం) ఫేజ్ –2లో భాగంగా ముఖ్యంగా వర్షాకాలంలో మెరుగైన పారిశుధ్యం పరిశుభ్రత వ్యర్థాల సేకరణ కమ్యూనిటీ మరియు పబ్లిక్ టాయిలెట్ లను క్రమం తప్పకుండా శుభ్రపరిచే లా సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ మన ఇంటితో పాటు మన ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం మనందరి బాధ్యత అని తద్వారా సీజనల్ వ్యాధులు సంక్రమించకుండా ఉంటాయన్నారు. వర్షాల నేపథ్యంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో పకడ్బందీ చర్యలు చేపట్టాలని డ్రైనేజి నాలాలతో పాటు చెరువులలో పేరుకుపోయిన వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించే పనులను చేపట్టాలని అధికారులకు సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ వో శ్రీనివాస్ రెడ్డి ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ మురళి బిఆర్ఎస్ మహిళా అధ్యక్షురాలు నిర్మల రమణారెడ్డి కైసర్ వెంకన్న అనిల్ విఠల్ దుర్గయ్య యూసఫ్ అలీ రామకృష్ణ రావు పారిజాత శ్యామ్రావు వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

## రాజకీయాలకు ఎన్టీఆర్ బ్రాండ్

-మొదటిపేజీ తరువాయి

లక్షణం. కమ్మసామాజికవర్గం నన్ను ఎంతగానో అభిమానిస్తుంది. ఎన్టీఆర్ లైబ్రరీలో మేం చదువుకున్న చదువు.. మమ్మల్ని ఉన్నతస్థానంలో నిలబెట్టింది. నాయకత్వానికి ఎన్టీఆర్ ఒక బ్రాండ్ క్రియేట్ చేశారు. ఎన్టీఆర్ రాజకీయంగా ఎంతోమందికి అవకాశాలు ఇచ్చారు. దేశంలో ఎన్టీఆర్ ప్రవేశపెట్టిన సంకీర్ణ రాజకీయాల వల్లే ఇవాళ చాలా మందికి రాజకీయ అవకాశాలు వచ్చాయి. హైదరాబాద్ నగరాన్ని విశ్వనగరంగా మార్చేందుకు మీరు భాగస్వాములు కావాలి. మీలో నైపుణ్యాలను ప్రోత్సహించడానికి మా ప్రభుత్వం సిద్ధంగా ఉంది. మాకు భేషజాలు లేవు.. మా కులాన్ని అభిమానిస్తాం.. ఇతర కులాలను గౌరవిస్తాం. తెలంగాణ రాష్ట్రంలో ఎవరిపై వివక్ష ఉండదు.. అది మా ప్రభుత్వ విధానం కాదు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలపడం ఒక హక్కు. నిరసన తెలపకుండా నియంత్రించాలనుకుంటే.. ఫలితాలు ఎలా ఉంటాయో మీరు చూశారు. జాతీయ స్థాయిలో తెలుగువారు లేని లోటు కనిపిస్తోంది. కుల, మతాలకు అతీతంగా జాతీయ స్థాయిలో రాణించే తెలుగువారిని ప్రోత్సహించాలి. వివాదంలో ఉన్న 5 ఎకరాల కమ్మ సంఘం భూ సమస్యను పరిష్కరిస్తాం. భూసమస్యను పరిష్కరించడంతో పాటు సంఘం భవన నిర్మాణానికి నిధులు ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది. పదిమందికి సాయం చేసే మీ సహజ గుణాన్ని వీడొద్దని కోరుతున్నాన"ని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. మాజీ గవర్నర్ రామ్మోహన్ రావు, మంత్రులు కోమటిరెట్టి వెంకటరెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సినీ నటుడు మురళీ మోహన్, జెట్టి కుసుమకుమార్, సత్యవాణి, జీవిత రాజశేఖర్ దంపతులు, ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు, కమ్మ ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## 25న తెలంగాణ కేబినెట్

**హైదరాబాద్ :** తెలంగాణ మంత్రివర్గం ఇరవై ఐదో తేదీన సమావేశం కానుంది. అసెంబ్లీలో ప్రవేశ పెట్టాల్సిన పూర్తి స్థాయి బడ్జెట్ ను మంత్రి వర్గం ఆమోదిస్తుంది. ఇరవై మూడో తేదీ నుంచే అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమవుతాయి. ఇరవై ఐదో తేదీన బడ్జెట్ ప్రవేశ పెడతారు . ఆ రోజు ఉదయమే అసెంబ్లీ కమిటీ హాల్‌లో .. మంత్రివర్గం భేటీ అవుతుంది. రైతు భరోసా పథకంపై చర్చతో పాటు, జాబ్ కాలెండర్‌ను విడుదల చేయటం వంటి అంశాలను ఈ సమావేశాల్లో ప్రభుత్వం ప్రకటించే అవకాశం ఉంది.

ఈ సారి తెలంగాణ బడ్జెట్ రూ.2.50 లక్షల కోట్ల వరకు ఉండే అవకాశం ఉంది. నిజానికి ఇంకా పూర్తి స్థాయి బడ్జెట్ ప్రతిపాదనలు రూపొందించలేదు. కేంద్ర ప్రభుత్వం ఈనెల 23వ తేదీన పార్లమెంటులో బడ్జెట్ ప్రవేశపెట్టనుంది. అందులో వచ్చే గ్రాంట్లు, బహిరంగ మార్కెట్ నుంచి సేకరించే రుణాలను బట్టి బడ్జెట్ ప్రతిపాదనలకు తుదిరూపు ఇవ్వనున్నారు. కేంద్రం నుంచి రూ.60 వేల కోట్లకు పైగానే గ్రాంట్లు, రుణాల రూపంలో వస్తాయని అంచనా వేస్తున్నారు. 2023–24లో కేంద్రం నుంచి రూ.41,259 కోట్ల గ్రాంట్లు వస్తాయని ప్రభుత్వం అంచనా వేసింది. చివరికి రూ.9,729.91 కోట్లు మాత్రమే వచ్చాయి. ఈ కారణంగా గ్రాంట్లలో 76.42% సొమ్మును ఇవ్వకపోవడంతో, రాష్ట్ర ఆదాయం రూ.2.18 లక్షల కోట్లకే పరిమితమైంది. ఈ కారణంగానే 23న కేంద్ర బడ్జెట్‌ను జాగ్రత్తగా పరిశీలించి, గ్రాంట్లపై స్పష్టమైన అవగాహన వచ్చిన అనంతరం రాష్ట్ర ఆదాయ, వ్యయాల మొత్తాలను రుపొందించాలని ఆర్థికశాఖకు ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది.

షణ్ముఖ వెలుగు

ePaper
www.shanmukhavelugu.com



## కరీంనగర్ జిల్లాకు ఈ బడ్జెట్‌లో న్యాయం చేయాలని

# బండి సంజయ్ పై కొండంత ఆశతో

**కేంద్ర బడ్జెట్ లో కరీంనగర్ కి ఐఐటీ మంజూరు చేయాలి**

**విభజన హామీల అమలుకు కేంద్ర మంత్రి బండి సంజయ్ కృషి చేయాలి**

**షణ్ముఖ వెలుగు స్టేట్ బ్యూరో హైదరాబాదు జులై 20** కేంద్ర ప్రభుత్వం 23న ప్రవేశపెట్టే కేంద్ర బడ్జెట్ లో తెలంగాణ కు రావాల్సిన విభజన హామీలు పూర్తి స్థాయిలో అమలు జరిగేలా కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కేంద్రం పై ఒత్తిడి తేవాలని విభజన హామీ చట్టం ప్రకారం కరీంనగర్ లో ఐఐటీ ఏర్పాటు చేయాలని విభజన హామీ చట్టంలో ఉన్న పది సంవత్సరాలు అయిన ఇప్పటికీ కరీంనగర్ లో ఐఐటీ ఏర్పాటు కాలేదని కరీంనగర్ జిల్లాకి రావాల్సిన ట్రిపుల్ ఐటీ గతంలో కర్ణాటకలోని రాయచూరు కు మంజూరు చేశారని ఈ బడ్జెట్ లో అయినా కరీంనగర్ లో ఐఐటీ మంజూరు చేయాలని గతంలో కరీంనగర్ జిల్లాకు సైన్స్ సెంటర్ స్థలం కూడా మంజూరు అయినా నిర్మాణ పనులు ఇప్పటికీ ప్రారంభం కాలేదని శాతవాహన యూనివర్సిటీ కి న్యాక్ గుర్తింపు లేదని శాతవాహన యూనివర్సిటీ కి 200కోట్ల నిధులు తీసుకురావాలని పార్లమెంట్ పరిధిలో స్కిల్ డెవలప్ సెంటర్ ఏర్పాటు చేయాలని కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని విద్యార్థి నిరుద్యోగ యువతకు విద్య ఉపాధి అవకాశాలు స్థానికంగా దక్కేలా కేంద్ర ప్రభుత్వ విద్యాసంస్థలు చిన్న పెద్ద తరహా కంపెనీలు పరిశ్రమలు కరీంనగర్ లో పార్లమెంటు పరిధిలో ఏర్పాటు అయ్యేలా బడ్జెట్ కేటాయింపుల్లో మంజూరు అయ్యేలా కేంద్ర మంత్రి బండి సంజయ్ చొరవ తీసుకోవాలని తెలంగాణ విభజన హామీ చట్టం ప్రకారం తెలంగాణలో ప్రతి జిల్లాకో నవోదయ పాఠశాల కేంద్రీయ విద్యాలయం ఐఐటీ ఐఐఎం లాంటి అనేక ఉన్నత విద్యాసంస్థల కేటాయింపులు చేయాలని విభజన హామీ చట్టం చెప్పినా ఇప్పటికీ అమలు



కాలేదని విభజన హామీల అమలు జరిగేలా కేంద్ర మంత్రి బండి సంజయ్ కృషి చేయాలని,కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ లో విద్యకు పది శాతం నిధులు కేటాయించాలని,కేంద్ర బడ్జెట్ లో తెలంగాణ విద్యార్థి యువతకు న్యాయం చేయాలని మణికంఠ రెడ్డి డిమాండ్ చేశారు

## అప్పు ఇచ్చిన రాజేశ్వరి అనే మహిళను హత్య చేసిన అమ్ము రజిత అలియాస్ లావణ్య

**షణ్ముఖ వెలుగు పెద్దపల్లి ప్రతినిధి జూలై 20** పెద్దపల్లి జిల్లా ముత్తారం మండల కేంద్రంలో గత నెల 8 వ తేదీన బావిలో మూటలో దొరికిన మహిళ అప్పు అడిగినందుకే మహిళను హత్య చేశారని గోదావరిఖని ఏసీపీ మడత రమేష్ తెలిపారు. మంథని పోలీస్ స్టేషన్ లో శనివారం సమావేశంలో మంథని సీఐ వెంకటేశ్వర్లు ముత్తారం ఎస్ఐ మధుసూధన్ రావులతో కలిసి నిందితుల వివరాలను తెలిపారు. ఈ నెల 5వ తేదీన ముత్తారంకు చెందిన అమ్ము రజిత అలియాస్ లావణ్య తన ఇంటి సమీపంలోని పెరక రాజేశ్వరి (65) వద్ద అప్పుగా లక్ష 50 వేలు అప్పు తీసుకుందని రాజేశ్వరి తరుచూ అప్పు డబ్బులు ఇవ్వమని అడిగినందుకు ఆగ్రహంతో 8వ తేదీన అప్పు ఇస్తానని రాజేశ్వరిని ఇంటికి పిలిచిన లావణ్య మరో వ్యక్తి కుక్క ముడి తిరుపతితో పాటు భర్త రవి అలియాస్ రమేష్ తో కలిసి ఇంట్లో గొంతు నులిమి చంపి అదే రాత్రి గోనె సంచిలో మూటకట్టి పారుపల్లి కి వెళ్ళే మార్గంలో వ్యవసాయ బావిలో వేశారన్నారు. హత్యలో పాల్గొన్న ముగ్గురిని శనివారం ఉదయం సీఐ వెంకటేశ్వర్లు ఎస్ఐ మధుసూధన్ రావు లు అరెస్ట్ చేశారని తెలిపారు. అప్పు ఇచ్చిన రాజేశ్వరి తమను తరచుగా డబ్బులు ఇవ్వాలని ఇబ్బందులు పెట్టేదని అందుకే ఆమెను హత్య చేసి రాజేశ్వరి ఒంటి పై ఉన్న బంగారం తీసుకున్నట్లు ఏసీపీ తెలిపారు.



నిందుతులను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. హత్య చేసిన నిందితులను చాకచక్యంగా పట్టుకున్న సీఐ, ఎస్ఐ లతో పాటు కానిస్టేబుల్స్ దుబాసి రమేష్ బాలగాని కిరణ్ లను ఏసీపీ అభినందించారు.


## 10 లక్షల ఆదాయం వరకు పన్ను మినహాయింపు నివ్వాలి

**రావికంటి పవన్ కుమార్ అసోసియేట్ ప్రెసిడెంట్**

**తూడూరి సతీష్ గౌడ్ స్టేట్ కౌన్సిలర్ తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్**

**షణ్ముఖ వెలుగు స్టేట్ బ్యూరో హైదరాబాదు జులై 20** కోట్లాది మధ్యతరగతి పన్ను చెల్లింపుదారులు మరియు వేతన జీవులు ప్రస్తుత పన్ను చెల్లింపు విధానంతో ఆర్థికంగా అనేక ఇబ్బందులు పడుతున్నారని 10 లక్షల ఆదాయం వరకు కేంద్ర ప్రభుత్వం పన్ను మినహాయింపు నివ్వాలని 'తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్' అసోసియేట్ ప్రెసిడెంట్ రావికంటి పవన్ కుమార్ తెలంగాణ స్టేట్ కౌన్సిలర్ తూడూరి సతీష్ గౌడ్ లు ఒక సంయుక్త ప్రకటనలో కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈనెల 23వ తేదీన కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో నిర్మల సీతారామన్ ఆధ్వర్యంలో పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెడుతున్నందున ప్రస్తుతమున్న ఇన్ కమ్ టాక్స్ స్లాబులను సవరించాలని 80సి పరిమితిని ఐదు లక్షల కు పెంచాలని స్టాండర్డ్ డిడక్షన్ లక్ష రూపాయలకు పెంచాలని వ్యక్తిగత పన్ను చెల్లింపదారులపై గరిష్ట ఆదాయ పన్ను పరిమితి 15 శాతానికి పరిమితం చేయాలని రావికంటి పవన్ కుమార్ తూడూరి సతీష్ గౌడ్ కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. దేశ ఆర్థిక వ్యవస్థ పురోగతిలో ఉన్నందున మధ్యతరగతి వేతన జీవులపై పన్ను భారం భారీగా తగ్గించాలని తద్వారా ప్రజల చేతుల్లో నగదు ఉంటుందని దీంతో వినిమయానికి డిమాండ్ పెరుగుతుందని తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ నాయకులు అభిప్రాయపడ్డారు. ఈ సమావేశంలో టిఆర్టిఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు తుంగూరి సురేష్ గుర్రం శ్రీనివాస్ గౌడ్ విజయానందరావు నల్లూరి జితేందర్ రెడ్డి గంగుల రణధీర్ కోరుట్ల రాజ్ కుమార్ మంచి కట్ల లక్ష్మీకాంత్ చౌడారపు రాంప్రసాద్ సిరాజ్ ఎం సత్యనారాయణ యాగండ్ల గంగాధర్ జి భూమేశ్వర్ టి లలిత తదితరులు పాల్గొన్నారు.





## బైక్‌లు చోరీలకు పాల్పడుతున్న వ్యక్తి అరెస్ట్ 26 ది చక్ర వాహనాలు స్వాధీనం








**చోరీ సొత్తును కొనుగోలు చేసిన ఇద్దరు అరెస్ట్ మరో ఇద్దరు పరార్**

**షణ్ముఖ వెలుగు కుత్బుల్లాపూర్ ప్రతినిధి జులై 20** పార్కింగ్ చేసి ఉన్న ద్విచక్ర వాహనాలను దొంగలిస్తున్న ఓ పాత నేరస్థుడిని బాలానగర్ సీసీఎస్ మరియు జీడిమెట్ల పోలీసుల వాహనాల తనిఖీల్లో పట్టుకున్నారు. మొత్తం 36 బైక్ ల చోరీలకు పాల్పడగా ఇందులో 26 ద్విచక్ర వాహనాల తో పాటు చోరీ చేసిన బైకులను కొనుగోలు చేసిన ఇద్దరు రిసీవర్ లను అదుపులోకి తీసుకున్నామని డిసిపి సురేష్ కుమార్ తెలిపారు. షాపూర్ నగర్ లోని బాలానగర్ డీసీపీ కార్యాలయం లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం లో డీసీపీ సురేష్ కుమార్ బాలానగర్ ఏసిపి హనుమంతరావు తో కలిసి నిందితుల వివరాలు మీడియాకు వెల్లడించారు. సంగారెడ్డి జిల్లా సింగూర్ గ్రామానికి చెందిన మహ్మద్ ఇస్మాయిల్ జల్సాలకు అలవాటు పడి సులభంగా డబ్బు సంపాదించేందుకు దొంగ తాళం చెవి లతో ద్విచక్ర వాహనాలు దొంగిలించడమే ధ్యేయంగా ఎంచుకున్నాడు. చోరీ చేసిన వాహనాలను జగద్గిరిగుట్ట కు చెందిన మహ్మద్ ఖురేషి బాబా మెదక్ జిల్లాకు చెందిన సోహెల్ మెదక్ పుల్కల్ కు చెందిన మంగలి శ్యామ్ సూర్యాపేట కోదాడ కు చెందిన షేక్ హుస్సేన్ అనే నలుగురు వ్యక్తులకు విక్రయించడం ప్రారంభించాడు. ఈ వాహనాలను తక్కువ ధరలకు ఇస్మాయిల్ దగ్గర నుండి కొనుగోలు చేసిన నలుగురు రిసీవర్ లు గ్రామీణ ప్రాంతాలలో అమ్మకాలు చేపట్టారు. వాహనాలను అమ్ముకుని సొమ్ము చేసుకునే వీరంతా గతంలో పాత నేరస్తులు జైలు జీవితం అనుభవించి బయటకు వచ్చినా వీరి పంథాను మార్చుకోకుండా మళ్లీ ఇదే దందా ను కొనసాగిస్తున్నారని పోలీసులు తెలిపారు. మొత్తం సైబరాబాద్ లో తొమ్మిది ద్విచక్ర వాహనాలు రాచకొండలో మూడు ద్విచక్ర వాహనాలు హైదరాబాదులో రెండు ఆంధ్రప్రదేశ్ లో 6 మొత్తం 36 వాహనాలు తస్కరించి ఇస్మాయిల్ వీరికి అమ్మగా వారు తక్కువ ధరకు కొనుగోలు చేసి అమ్ముకున్నారని తెలిపారు. ఇటీవల జీడిమెట్ల పోలిస్ స్టేషన్ పరిధిలో బాలానగర్ సిసిఎస్ పోలీసులు జీడిమెట్ల పోలీసులు వాహన తనిఖీలు చేపడుతుండగా నిందుతుడు మహ్మద్ ను అదుపులోకి తీసుకున్నారు. అతను ప్రయాణించే వాహన పత్రాలు అడగగా పొంతన శ లేని సమాధానం ఇవ్వడంతో అనుమానం వ్యక్తం చేసిన పోలీసులు అతని అదుపులోకి తీసుకొని తమదైన శైలిలో విచారించారు. ఈ దర్యాప్తులో ఇస్మాయిల్ మొత్తం 36 బైక్ చోరీలకు పాల్పడ్డాడని ,అందులో 25 ద్వి చక్ర వాహనాలు మిగితా నిందితుల వద్ద రికవరీ చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు పోలీసులు. మిగతా ఇద్దరు రిసీవర్ లు మంగలి శ్యామ్ సోహెల్ లు పరారీలో ఉన్నారని వారి వద్ద ఇస్మాయిల్ అమ్మిన 11 వాహనాలు త్వరలో రికవరీ చేస్తామని డిసీపీ సురేష్ కుమార్ తెలిపారు.

## వర్షాకాలంలో విద్యుత్తు ప్రమాదానికి గురికాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు.



**షణ్ముఖ వెలుగు స్టేట్ బ్యూరో హైదరాబాదు జులై 20** 1.తడిసిన కరెంట్ స్తంభాలను ముట్టుకోరాదు.
2.విద్యుత్ లైన్ కు తగులుతున్న చెట్లను ముట్టుకోరాదు.
3.విద్యుత్ లైన్ కు చెట్టు కొమ్మలు తగిలితే సంబంధిత అధికారికి తెలియచేయవలెను.
4.పార్కులలో గాని స్టేడియంలో గాని విద్యుత్ స్తంభాలు ముట్టుకోరాదు.
5.ఇంట్లో ఉన్న స్విచ్ బోర్డు లను తడి చేతులతో ముట్టుకోరాదు.
6.బయట పెట్టిన లైట్లు నీటితో తడవకుండా చూసుకోవాలి.
7.కరెంటు కు సంబంధించిన వస్తువులు తడి చేతులతో ముట్టుకోరాదు.
8.చిన్న పిల్లలను కరెంటు వస్తువుల వద్దకు రాకుండా చూసుకోవాలి.
9.ఉతికిన బట్టలు ఇనుప తీగలపై వేయకూడదు.
10.గాలి, దుమారం, వర్షం వలన తెగిన విద్యుత్ వైర్లను ముట్టుకోరాదు.
11.ఇంట్లో ఉన్న వాటర్ హీటర్ యొక్క స్విచ్ ఆఫ్ చేసి ప్లగ్ తీసిన తర్వాతనే నీళ్లు పెట్టిన వస్తువును ముట్టవలెను.
12.ఉరుములు మెరుపులతో వర్షం పడేటప్పుడు "డిష్ " కనెక్షన్ తీసివేయవలెను.
13.వర్షం పడుతున్నప్పుడు టీవీ, ఫ్రిడ్జ్, వాటర్ మోటార్స్ మరియు కంప్యూటర్ ల యొక్క స్విచ్ లను ఆఫ్ చేయవలెను, లేనిచో వైర్లు షార్ట్ సర్క్యూట్ అయ్యే అవకాశం ఉంటుంది.
14.కరెంటు లైన్ క్రింద సెల్ ఫోన్ మాట్లాడకూడదు.
15.ఇంట్లోకి వచ్చే సర్వీస్ వైర్ ఏమైన డ్యామేజ్ అయినచో సంబంధించిన అధికారి దృష్టికి తీసుకెళ్లాలి. ప్రతి కరెంటు వస్తువు కు "ఎర్త్ " తప్పనిసరిగా గా ఉండాలి.

## అద్భుతం.. చనిపోయిన గాజా కు చెందిన అల్ కుర్ద్ తల్లి గర్భంలో సజీవంగా బిడ్డ



**షణ్ముఖ వెలుగు స్టేట్ బ్యూరో హైదరాబాదు జులై 20** గాజాపై ఇజ్రాయెల్ భీకర దాడులు కొనసాగిస్తోంది. తాజాగా ఓ బిల్డింగ్ పై ఇజ్రాయెల్ వైమానికి దాడులు చేసింది. దీంతో అల్-కుర్ద్ అనే గర్భిణీ తీవ్రంగా గాయపడింది. ఆసుపత్రిలో చేరాక ఆమె చనిపోయింది. అయితే అల్ట్రా సౌండ్ స్కానింగ్ ద్వారా ఆమె గర్భంలో బిడ్డ హార్ట్ బీట్‌ను వైద్యులు విన్నారు. ఆపరేషన్ చేసి బిడ్డను బయటకు తీశారు. ప్రస్తుతం ఆ శిశువు ఇంక్యుబేటర్‌లో ఉన్నాడు. బిడ్డ బ్రతకడం అద్భుతమని వైద్యులు పేర్కొన్నారు

## జమ్మికుంట నూతన ఎస్సైగా టీ. వివేక్

**షణ్ముఖ వెలుగు స్టేట్ బ్యూరో హైదరాబాదు జులై 20** జమ్మికుంట నూతన ఎస్సైగా టీ. వివేక్ జమ్మికుంట పోలీస్ స్టేషన్ నూతన సబ్ ఇన్ స్పెక్టర్ గా టి. వివేక్ శనివారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా కరీంనగర్ కమిషనరేట్ కార్యాలయంలో ఎస్సైగా పనిచేస్తున్న వివేక్ ను జమ్మికుంట ఎస్సైగా బదిలీ చేస్తూ కరీంనగర్ పోలీస్ కమిషనర్ అభిషేక్ మహంతి ఉత్తర్వులు జారీ చేయగా శనివారం బాధ్యతలు స్వీకరించారు. జమ్మికుంట పోలీస్ స్టేషన్ లో ఎస్సైగా పనిచేసిన ఎస్ రాజేష్ ను కరీంనగర్ విఆర్ కు అనుసంధానం చేశారు.



## బోడుప్పల్ పరిధిలో బోనాలు సందర్భంగా భక్తులకు ఇబ్బంది కలగకుండా చర్యలు: మేయర్ అజయ్



**షణ్ముఖ వెలుగు మేడిపల్లి ప్రతినిధి జులై 21** బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో రానున్న బోనాల పండుగ సందర్భంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ప్రజల సౌకర్యార్థం బంగారు మైసమ్మ గుడి వద్ద రోడ్ల మరమ్మత్తుల గురించి సంబంధిత అధికారులతో కలిసి సందర్శించిన బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ అజయ్ యాదవ్ డిప్యూటి మేయర్ కొత్త స్రవంతి కిషోర్ గౌడ్ కార్పొరేటర్ చీరాల నర్సింహా మేడ్చల్ కాంగ్రెస్ పార్టీ బి బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్ తదితరులు ఉన్నారు.

## మందుల వంశీ (ఎల్లేష్) ఆత్మహత్యకు కారకులైన వారిని అరెస్ట్ చేయాలి

**కఠిన శిక్ష పడే విధంగా తగిన చర్యలు తీసుకోవాలి**

**భువనగిరి డీసీపీ ని కలిసిన బాధిత కుటుంబ సభ్యులు**



**షణ్ముఖ వెలుగు అడ్డ గూడూరు ప్రతినిధి జులై 20** యాదాద్రి భువనగిరి జిల్లా అడ్డ గూడూరు మండలంలోని కోటమర్తి గ్రామానికి చెందిన మందుల వంశీ(ఎల్లేష్) ఆత్మహత్యకు కారకులు ఐన వ్యక్తులను వెంటనే అరెస్టు చేసి తగిన శిక్ష పడేటట్టు గా చేయాలని భువనగిరి డీసీపీ రాజేష్ కు బాధితులు విజ్ఞప్తి చేశారు 25 రోజులుగా కేసు నమోదు ఐనా ఏ 1ని అరెస్టు చెయ్యలేదని వెంటనే అరెస్టు చెయ్యడానికి తగిన చర్యలు తీసుకోవాలని బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు ఈ కార్యక్రమంలో బాధిత కుటుంబం గ్రామ ధర్మ సమాజ్ పార్టీ నాయకులు అందీప్ సైదులు మందుల బిక్షం మందుల బయ్యన్న వడ్డె యాదగిరి బెల్లా గిరిబాబు యాదాద్రి జిల్లా నాయకులు శివ రాజు తదితరులు పాల్గొనారు

On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT NO.51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN: 523225. Mobile: 9494177939, RNI: APTEL 16448. e-mail: rkreport9@gmail.com. E-Paper: shanmukhavelugu.com